ముందే ముక్కిడి. అందులో దగ్గు పడిశెంలా ఉందా బస్సు ప్రయాణం సంగతి. వేసవి సెలవుల్లో సహజంగానే ప్రయాణీకుల సంఖ్య ఎక్కువగానే ఉంటుంది. దానికి తోడు సింగరేణి కాలరీస్ సమ్మె. ఇక పారిశ్రామిక పట్టణం గోదావరిఖని బస్సుల్లో జనం సంగతి చెప్పాలా? కరీంనగర్‌కు పోతున్న ఆ ఆర్డినరీ బస్సులో క్రిక్కిరిసిన జనం. ఫుట్‌బోర్డ్ దగ్గర్నుండి ఆ చివరి వరకు జనాలు తోసుకుంటూనే ఉన్నారు. ఎండాకాలం కావడంవల్ల భరించరాని ఉక్కపోత.

డోర్‌ను పట్టుకొని వేలాడుతున్న జనాలను అతికష్టంగా లోపలకు తోసి డోరేసాడు కండక్టర్.

''బస్సును పోనియ్యండ్రి కండక్టర్ సాబ్... మస్తు ఉడుకపోత్తంది... టిక్కట్లు తర్వాతియ్యచ్చు...''

''మీరట్లనే అంటరు... మీదేం బోతుంది...? ముందట మాకు మిండెడుంటడు... గీ జనం సంగతయినకేం పట్టి... దొరుకుతె ఇంటికి పంపిత్తడు''

''రైట్ రైట్'' అని పంచ్‌తో బస్సు రాడ్ మీద రెండు దెబ్బలేస్తూనే అన్నాడు కండక్టర్.

జనాలను తోసుకుంటూ ఒంటికాలిపై నడుస్తూ బస్సు వెనుక భాగంలోకి చేరుకున్నాడు కండక్టర్.

సీట్లు దొరికి కూర్చున్నవాళ్ళు సింగరేణి సమ్మె గూర్చి మాట్లాడుకుంటున్నారు.

నిండు గర్భిణిలా ఉన్న బస్సు గతుకుల రోడ్డు మీద అపసోపాలు పడుతూ నడుస్తుంది.

''నాలుగేండ్ల కింద ఇయ్యవల్సింది వేజ్... ఇంకా ఇయ్యకపోయిరి... ఇగ సమ్మె చెయ్యకుంటే సత్తమా...?''

''మీకు జీతాలు చాలయనా...? ఇంకా పెరుగుడెందుకు?''

అందులోనే ప్రయాణం చేస్తున్న ఓ ఉపాధ్యాయుడన్నాడు.

ఆతని దిక్కు అదోలా చూసాడా కార్మికుడు.

''మాకు జీతాలు బాగున్నయా సారు...? సరె... జీతాలు పెంచకపోని యియ్యండ్రి... ధరలొక్క పైసన్న పెరగకుండ సూడనియ్యండ్రి... బల్లల్ల వెయిలకొద్ది పేసులాయె. డాక్టరు చెయ్యిపట్టి నూరనె... జీతాలు బాగ తీసుకుంటున్నాం మేం...''

''మరి మా రైతుల సంగతో...?''

''నేం గూడ రైతునే ఇయ్యాల్ల గీ సింగరేణి లేబరైన... ఎవుసంల ఎంత జేసినా ఏడేమాన్కలైతందని గీడికచ్చిన...''

''మరి గీత పద్నాలుగు మాన్కలైతందా?''

''ఇగో... ఇక్కడి సంగతెట్లున్నదంటె పెనం మీదికెల్లి పొయ్యిల వడ్డట్టయింది''

టికెట్ టికెట్ అంటూ ఆ కార్మికుడి దగ్గరకొచ్చాడు కండక్టర్.

''వెయిలకొద్ది జీతం తీసుకుంటనే మాట్లాడుతన్నవు తియ్యి... ఊళ్ళున్నపుడు గీ పయింట్లు తొడిగినవా...? చేతికి గడియారం బెట్టినవా...?'' టికెట్ చింపి ఇస్తూ అన్నాడు కండక్టర్.

''నువ్వాని ఎంకటన్న... గీ పొంట్లు తొడుగంగనే ఏమచ్చె... ఇంటి పేరు కస్తూరోల్లు ఇంట్ల గబ్బిలాల వాసనన్నట్టుంది మా సంగతి... ఇక్కడకచ్చి బాగ సంపాయించిన మనుకుంటున్నవా ఏంది...?''

''ఊళ్ళె భూములమ్మితె కొంటున్నది మీ సింగరేణోల్లేనాయె నాకు తెలువదా ఏంది...?''

''కొన్నం తియ్యే అప్పకండెడు భూములు... పైస సంగతులల్ల జూత్తె ఊళ్ళె కంటె ఇక్కడ కొంత నయ్యమే... కాని, ఇక్కడున్న కష్టాలిక్కడున్నయే వెంకటన్న... ఇక్కడ చల్లటి నీల్లు దొరుకుతయా? చక్కటి గాలి దొరుకుతదా? అంతా బొగ్గు పొగ... మన్ను... మసానం... ఇక్కడంత వడ్లు పెరుగు కలిపినట్టే ఉందే...''

''అట్లనా? అయితె మరి మల్ల ఊల్లకే పోకపోయినావ్...'' కొంచెం వ్యంగ్యం ధ్వనించేట్టు అన్నాడు వెంకటయ్య.... ఇతర్లకు టికెట్లిస్తూనే ఉన్నాడు.

''పోకుంటె ఈడనే శాశ్వతంగ ఉంటననుకుంటున్నవా...? ఎన్ని రోజులున్నా ఇక్కడ సేపోయికున్నట్టే... ఊళ్ళకు పోతెనే నాకు తురితుంటది. నీయవ్వ అవ్వయ్యలను ఇడ్సిపెట్టి, ద్గగరోల్లందర్ని ఇడ్సిపెట్టి ఏం నౌకరే గీ తట్ట మోసుడు నౌకరి...?''

''ఊళ్ళె కొంత భూమి కొన్నవు... కొంత కడుపు నిండినట్టుంది... అందుకే ఈ నౌకరెందుకనిపిస్తుంది? అంతేనా...?''

''గదేం కాదే వెంకటన్న... ఎందుకో కాని బొగ్గు బాయి పని శాశ్వత మనిపిస్త లేదు... భూమే శాశ్వతమైందనిపిత్తంది... పోతె ఊల్లల్ల ఇరువయేండ్ల కిందున్నట్టేం లేదు... మునుపటోలె దొరలది సాగుతలేదు... ప్రజలు తెలివికచ్చిండ్రు... పోచంపాడు కాలువనీళ్ళచ్చినంక పంటలు గూడ ఓ తీరుగనే పండుతన్నయి...''

''ఆ మాట నిజమే'' అనుకుంటూ ముందుకెళ్ళిపోయాడు వెంకటయ్య.

''టికెట్ టికెట్'' అంటూ టికెట్లు గబగబా కట్ చేస్తున్నాడు.

డోర్ కెదురుగా ఉన్న స్త్రీల సీట్లో కూర్చొనున్న ఓ ముసలమ్మ కండక్టర్ బస్సు లోపలికొచ్చిందగ్గర్నుంచీ అతన్నే చూస్తుంది - వెనక కెళ్ళినా ఆతన్ని చూడటానికే ప్రయత్నిస్తుంది. టికెట్ కోసం ఆమె దగ్గరకు రాగానే అతన్ని పరీక్షగా చూసింది.

''అయ్యో! నువ్వేనా బిడ్డ... ఎవ్వలో అనుకున్న. నౌకరి జేత్తన్నవా నువ్వు...'' కండక్టర్ నుద్దేశించి అంది ముసలవ్వ.

''నేను నేనే కని టికెట్ తీసుకో...''

''అయ్యో! తొందరపడవడ్తివి బిడ్డ... కడుపు నిండ మాట్లాడుతేం బాయి...?''

''ముసలవ్వా! గీ మందిలేం మాట్లాడాలె చెప్పు. దగ్గదామంటె తీరిసత్తలేదు... ఇంతకు నేనెవ్వలో తెలుసా...?'' వేరే వాళ్ళకు టికెట్లు ఇస్తూనే అన్నాడు వెంకటయ్య.

''నువ్వెందుకు తెలువది బిడ్డ... నువ్వు బొస్త బొందాలు కొడుకువు గదా... మీది తెలుకుంట గదా... మీ తాత నాతోటోడు...''

''నిజమే కని మీదే వూరమ్మ...?''

''మాది అప్పన్నపేట. మీ అమ్మగారూరు మా ఊరేనాయె... నువ్వు చిన్నప్పుడూనె మీ అమ్మగారూరికి వచ్చెటోనివి... మా ఇంటి పక్కన ఆల్ల ఇల్లుంది... నా మనవరాలితోని ఆడుకునెటోనివి... నువ్వు నెక్కర్లు కట్టుకోంది కూడ నాకెరుకే...''

''ముసలవ్వా! నువ్విప్పుడా సార్లు బట్టలు లేకుండ నిలబెడుతన్నవేంది...?'' అక్కడే నిల్చొనున్న ఒకతనన్నాడు.

ఆ మాటలకు కండక్టర్‌తో సహా అంతా నవ్వారు.

''ఏం... అంటేంబాయె... మనుమడాయెపటికె అట్లంటి... మనుమనితోని గాకుంటె పరాసికాలెవ్వలతో నాడుతరు...''

''అంటె మానాయె కని అందరికి టిక్కెట్లిచ్చుడై పెయింది... పైసల్దియ్యి.... టిక్కెట్టియ్యాలె...''

బొడ్లోంచి బట్టతో కుట్టిన చిన్న సంచీని బయటకు తీసిందామె.

''తియ్యి ముసలవ్వ పైసల్దియ్యి...''

పైసలివ్వకుండానే కండక్టర్ దిక్కు చూస్తూ నవ్విందామె.

''ఏం జూత్తన్నవు...? సంచిల బాగనే పైసలున్నట్లున్నయి గద...''

''మా తీత్తగని బిడ్డ... నేను మీ నాయినమ్మ ననుకోలేవు... టిక్కటియ్యకుంటేం బాయె...''

ముసలమ్మ మాటలు విని నవ్వాడు వెంకటయ్య.

''మా నాయినమ్మ కాదు... మా అమ్మ బస్సెక్కినా టికెట్ తీసుకోవాలె. నేం దీసుకుంట... ఇదేమన్న నా స్వంత బస్సా ముసలవ్వ... నేంగూడ నౌకరిగాన్నేనైతి...''

వెంకటయ్య మాటలు ముసలవ్వకు నచ్చలేదు. తానింత అప్యాయంగా మాట్లాడినా ఇంకా టికెట్ తీసుకుంటాననడం బాగనిపించలేదు.

''ఐతె మానయెగని ఎన్ని రూపాయలు...''

''ఆరు రూపాయలు...''

''గన్ని పైసలా బిడ్డ. ఇయాకాల్ల రేపు పైసలకు విలువ లేకుంటయి పోతంది. కేక పెట్టన్న లేసూల్లకు గూడ బస్సుల మీన పోతండ్రు... ఎనుకట్నైతె మేం ఎములాడకు, కొంరెల్లికి గూడ నడ్సిపెయినం...''

''ఎప్పటికాలమప్పుడమ్మ... ఇప్పుడు... సుఖాలు పెరిగినయి... సరెగని పైసలియ్యి ఆల్చమైతంది...''

''నువ్వు చెప్పినన్ని ఇయ్యన్నా మనుమడ...''

''నీకేమన్న ఎక్కో జెప్పిన్నా ముసలవ్వ... ఎక్కో టికెట్ గొడితె నాకేమత్తది...? అందరికెంతో నీకు గంతే...''

''అయితె మానాయెగని బిడ్డ... తెలిసినోల్లకు గూడ పురాగ టిక్కటేనా...?''

ఆ మాటలకందరూ నవ్వారు.

ముసలవ్వ ముఖం ముడుచుకుపోయింది.

''కాదు ముసలవ్వ... తెలిసినోల్లకు తెలువనోల్ల కనేముండది... అందరికి సమానమే... నేం జెప్పితి గద మా అవ్వ వచ్చినా గింతే టికెట్ కొడుదునని...''

సంచీలోంచి డబ్బుల్దీసి కండక్టర్ కిచ్చింది ముసలవ్వ...

''సంచిల బాగనే పైసలున్నయి గద ముసలవ్వ... నీ కొడుకు సింగరేణి కాలరీలల్ల పనిజేత్తండా...'' టికెట్ చేతిలో పెడుతూ అన్నాడు వెంకటయ్య.

ఇన్ని మాట్లాడినా పూర్తి డబ్బులు తీసుకున్న కండక్టర్ మీద కోపంగా ఉంది ముసలవ్వకు.

''ముసలవ్వ మనసు''

— డా॥ కాటవ మల్లయ్య

''కండ్లు పాడుగాను... నా పైసలమీద చూపుపడ్డదా...? తన మనుమడు వచ్చేటప్పుడు టికెట్ పైసలు పోను ఇన్నూరు రూపాయలిచ్చిండు... అరటిపండ్లు కొనిచ్చిండు... బ్రెడ్ పూడ కొనిచ్చిండు... బస్సెక్కిచ్చి పోయిండు...''

తనలో తాను గొణుక్కున్నట్టనుకుంది ముసలమ్మ.

''ఆ... ఆ... నా మనుమడు వస్తేత్తండు...'' అంది.

టిక్కెట్లివ్వడం ముగించి తన సీట్లో కూర్చున్నాడు వెంకటయ్య. ఎస్. ఆర్ రాసుకుంటూ ''ఎంతిచ్చిండు...?'' అన్నాడు.

''ఎంతిత్తె నీకేంది...?'' అని ముఖం మాడ్చుకుందామె.

ఎస్. ఆర్. రాయడం పూర్తిచేసి ఊపిరి పీల్చుకున్నాడు వెంకటయ్య. బస్సు ప్రతి స్టేజి దగ్గరా ఆగుతుంది. దిగేవాళ్ళు దిగుతున్నారు. ఎక్కేవాళ్ళు ఎక్కుతున్నారు.

కండక్టర్ మనసులో ఆ ముసలవ్వ తనను మనుమడన్న మాటలే చెవుల్లో గింగురు మంటున్నాయి... తానెంతో ప్రేమించే చనిపోయిన నాయినమ్మ కళ్ళ ముందు కదిలింది. తేపకోసారి ముసలమ్మ దిక్కే చూస్తున్నాడు.

బస్సు పరుగెడుతూంది...

''ఈ కండక్టర్లను నమ్మద్దు... చదువుకున్నోల్ల లంగలుంటరు... నా ద్గగర బాగ పైసలున్నయన్నడు...' తనలో తాననుకుంటుంది ముసలమ్మ.

ఇంతలో అప్పన్నపేట చేరుకుంది బస్సు. ముసలమ్మను చేయిపట్టి కిందికి దింపాడు.

కదలబోతున్న బస్సు నాపాడు.

''ఓ నాయినమ్మా... ఇగో నీ పైసల సంచి... గిట్ల పోగొట్టుకుంటెట్ల...? సంచిని మంచిగ దాచుకో... పైసలన్ని ఉన్నయేమొ లెక్కబెట్టుకో...'' అని సంచీని కిందనిల్చున్న ముసలమ్మ చేతిలో పెట్టి 'రైట్ రైట్' అని పంచ్‌తో రాడ్‌పై కొట్టాడు వెంకటయ్య.

బస్సు కదిలి పరుగందుకుంది.

''ముసలవ్వా... నువ్వు మా నాయినమ్మవే. మా నాయినమ్మచ్చినా ఇంతకంటె చేసేవాన్ని కాదు...'' కిటికీలోంచి ముసలమ్మను చూస్తూ అనుకున్నాడు వెంకటయ్య.

కింద నిల్చుని డబ్బులు లెక్కపెట్టుకుంది ముసలమ్మ.

కండక్టర్‌ను గురించి అలా అనుకున్నందుకు తనను తానే నిందించుకుంది.

మనుమడిచ్చి రెండువందలు, టికెట్ డబ్బులు పోను మరో పది రూపాయాలున్నాయా సంచిలో...

'కొడుకు ఎంత మంచోడు? ఈ సంచి ఇంకెవరి చేతుల్లన్నా పడితే ఏమయ్యేది? వెంకటయ్య నా స్వంత మనుమడే అనుకుంట... ఎప్పుడన్న వాళ్ళ అమ్మమ్మ ఇంటికచ్చినపుడు పిలిచి కొన్ని గోసి అన్నం బెడుత...'

తనలో తాననుకుంటూ ఇంటి దిక్కు నడిచింది ముసలమ్మ.

☆